సామాన్యుడి ఆయుధం

# ప్రజల అస్త్రం

T/AP/2024/0304/1072/41

తెలుగు దినపత్రిక

ANDHRA PRADESH

prajalaastram999@gmail.com

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 సంచిక: 308 పేజీలు: 6 మంగళవారం 25-3-2025 వెల: 5/రూ -

## విలేకరులు కావలెను..

అస్త్రం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను.. సీనియర్ రిపోర్టర్స్ కి ప్రాధాన్యత ఇవ్వబడును.. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

ఎడిటర్. 89193 45606

## ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

- లోకేశ్ సమక్షంలో జార్జియా నేషనల్ వర్సిటీతో ఒప్పందం
- ఏర్పాటుకు ముందుకొచ్చిన జార్జియా నేషనల్ యూనివర్సిటీ
- లోకేశ్ సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం

అమరావతి:ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ(జీఎన్‌యు) ముందుకొచ్చింది. ఈమేరకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖతో సోమవారం జీఎన్‌యూ ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయం స్థాపనకు జీఎన్‌యు రూ.1300 కోట్ల పెట్టుబడులు పెడుతుందని, 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ ఒప్పందం ఒక నిదర్శనమన్నారు. కాగా, రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యం. జార్జియా యూనివర్సిటీ

- మిగతా 2వ పేజీలో






# రాష్ట్రంలో పూర్తిగా పేదరిక నిర్మూలనే కార్యక్రమం లక్ష్యం

- పేదలకు, సంపన్నులకు వారధిగా కార్యక్రమం రూపకల్పన
- అట్టడుగునున్న వారికి చేయూత ఇచ్చే వేదిక
- ఎన్నారైలు సహా ఎవరైనా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు
- దాతలకు 'మార్గదర్శి'గా, లబ్ధిదారులకు 'బంగారు కుటుంబం'గా నామకరణం
- మొదటి విడతలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సమీక్షలో సీఎం.. ఉగాదికి అమరావతిలో ప్రారంభం

అమరావతి:రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు వినూత్నంగా పీ4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పేదలకు సంపన్నులు సహాయం చేసేందుకు, తద్వారా పేదరికం లేని సమాజం నిర్మించేందుకు వీలుగా ఆ కార్యక్రమం కింద ఓ వేదికను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని వెల్లడించారు. మొదటి విడతలో 20 లక్షల కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. 2029 కల్లా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పీ4 కార్యక్రమాన్ని ఉగాది రోజున ప్రారంభిస్తున్న నేపథ్యంలో, సోమవారం సచివాలయంలో ఆ కార్యక్రమం నిర్మాణంపై సీఎం సమీక్ష నిర్వహించి ఆమోదం తెలిపారు. ఎన్నారైలు సహా పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో భాగస్వాములు కావాలని

మిగతా 2లో

# వారంలో విస్తరణ!

- రాష్ట్ర మంత్రివర్గంలోకి నలుగురికి అవకాశం
- రేసులో సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్, వివేక్, వాకిటి శ్రీహరి
- పలువురి శాఖల్లోనూ భారీగా మార్పులు!
- ఏఐసీసీ పెద్దలతో రేవంత్, భట్టి, మహేశ్, ఉత్తమ్ భేటీ
- ఖర్గే, రాహుల్, వేణుగోపాల్‌తో 2 గంటల పాటు చర్చలు
- క్యాబినెట్‌పై ఇదే చివరి భేటీ అంటున్న మహేశ్ కుమార్
- లంబాడాల నుంచి ఒకరికి డిప్యూటీ స్పీకర్ అవకాశం?



న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా మంత్రివర్గ కూర్పు పూర్తయ్యే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు మహేశ్ కుమార్ గౌడ్ ఏఐసీసీ కార్యాలయానికి వెళ్లగా, 7 గంటల సమయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. ఉత్తమ్ ఆలస్యంగా వెళ్లి, అందరి కంటే ముందే బయటికి వచ్చేశారు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఎప్పటి నుంచో వాయిదా

- మిగతా 2వ పేజీలో

## ఉగాదిలోపు రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

- పాత కాపుకేనా లేక కొత్తగా చేరిన వారికి అవకాశం ఇస్తారా?
- బీసీ నేతను నియమిస్తారా... ఓసీకి దక్కుతుందా?
- ముందు వరుసలో ఈటల పేరు, పరిశీలనలో ఎంపీలు డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు కూడా..
- అనూహ్యంగా తెరపైకి కేంద్రమంత్రి బండి సంజయ్...అయితే తాను పోటీలో లేనని వివరణ... సంజయ్‌కు దక్కినా దక్కొచ్చని పార్టీలో ఊహాగానాలు

2లో



2లో

## ఎంపీల జీతాలు 24% పెంపు

- 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి
- కేంద్రం నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యుల జీతాలు 24 శాతం పెరిగాయి. ఈ పెరుగుదల 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుంది. వ్యయ ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ప్రస్తుత ఎంపీల రోజువారీ భత్యాలను కూడా పెంచుతున్నట్లు వెల్లడించింది. మాజీ ఎంపీలకు పింఛను, ఐదేళ్లకు మించి పని చేసిన ప్రతి సంవత్సరానికి ఇచ్చే అదనపు పింఛనులను కూడా పెంచినట్లు తెలిపింది.



## రైతులకు ప్రభుత్వమే పూర్తిస్థాయిలో పరిహారం అందించాలి

- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్
- వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో 4 వేల ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టం
- మన ప్రభుత్వం రాగానే నెల రోజుల్లోనే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా
- చంద్రబాబు సర్కారు వచ్చాక ఉచిత పంటల బీమాకు మంగళం
- ఇప్పటికే ఒక ఏడాది రూ.26 వేల పెట్టుబడి సాయానికి ఎగనామం


కడప: 'అకాల వర్షం.. పెనుగాలులు.. వడగళ్ల ధాటికి అరటి తోటలు నేల కూలాయి. లక్షలాది రూపాయలు పెట్టుబుడులు పెట్టిన రైతన్నలు ఇవాళో రేపో అరటి గెలలు కోసే సమయంలో తీవ్ర నష్టం సంభవించింది. ఇలాంటి క్లిష్ట సముయంలో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఎంతో కొంత ఆసరాగా నిలబడాలి.. కానీ ఈ సర్కారు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో

## అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

- తన సస్పెన్షన్‌పై బులెటిన్ ఇవ్వాలని స్పీకర్‌కు వినతిపత్రం
- కోర్టుకు పోతాననే భయంతోనే బులెటిన్ ఇవ్వడం లేదన్న ఎమ్మెల్యే



హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనకుండా తనపై విధించిన సస్పెన్షన్‌కు సంబంధించిన అధికారిక బులెటిన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సోమవారం స్పీకర్ చాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను జగదీశ్‌రెడ్డి కలిశారు. తనను అన్యాయంగా, ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ఇప్పటికైనా తన సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయడంతోపాటు అసెంబ్లీ వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పీకర్‌కు



2లో

## తిరగదోడాల్సిందే

- ఈడీ, సీబీఐతో దర్యాప్తు జరిపించాలి
- అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం
- ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగిస్తే
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ప్రకటన
- జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశించాలని సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది వ్యాజ్యం
- జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి కొలీజియం సిఫారసు

ప్రజల అస్త్రం
మంగళవారం
25-3-2025

# వారంలో విస్తరణ!

(మొదటి పేజీ తరువాయి)

పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల తర్వాత జరిగేది మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గంలో నలుగురికి అవకాశం కల్పించడంతో పాటు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే చాన్స్ ఉన్నట్టు అభిప్రాయ పడుతున్నాయి. ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన కొంతమంది కీలక నేతలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే అంశంపై సమావేశంలో కీలకంగా చర్చించినట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిలకు అవకాశం ఇవ్వాలనే అంశంపై చర్చ జరిగినట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకాటి శ్రీహరి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డిల పేర్లు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది. సుదర్శన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత నెలకొన్న పరిస్థితిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, వాకాటి శ్రీహరి ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి పేర్లు ముందు వరసలో ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గంలో మొత్తం ఆరుగురికి చోటు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి నలుగురికే చోటు కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరో రెండు మంత్రి పదవుల భర్తీపై ఎలాంటి చర్చా జరగలేదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మంత్రివర్గంలో ఎస్టీకి అవకాశం కల్పించాలనే డిమాండ్ కీలకంగా వినిపిస్తోంది. దీనిపైనా చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి అవకాశం కల్పించలేని పక్షంలో డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పీసీసీ, కార్పొరేషన్ పదవులపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్ గౌడ్ స్పష్టం చేశారు. విస్తరణ, పీసీసీ పదవులు, సంక్షేమ పథకాలపై అధిష్ఠానం పెద్దలతో చర్చించామన్నారు. అన్ని విషయాలను వారికి వివరించామని అన్నారు. ఏఐసీసీ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాహుల్ చెప్పారన్నారు. రాష్ట్రంలో ఆ రెండూ అమలు అవుతున్న తీరును ఆరా తీశారని చెప్పారు. సమీకృత గురుకులాల గురించి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్లు, బోర్డుల నియామకంపై కూడా చర్చ జరిగిందని వెల్లడించారు. త్వరలోనే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాలపై అధిష్ఠానంతో ఇదే చివరి సమావేశమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# ఉగాదిలోపు రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

హైదరాబాద్: రాష్ట్ర బీజేపీకి ఉగాదిలోపు కొత్త అధ్యక్షుడు వస్తారనే ప్రచారం పార్టీవర్గాల్లో ఊపందుకుంది. దీనికి సంబంధించి ఒకటి, రెండురోజుల్లోనే పూర్తి స్పష్టత వస్తుందని ముఖ్యనేతలు చెబుతున్నారు. తాజాగా కేరళ పార్టీ అధ్యక్షుడిగా రాజీవ్‌చంద్రశేఖర్‌ను నియమించడంతో ఈ ఊహాగానాలకు బలం చేకూరుతోంది. త్వరలోనే కేంద్రమంత్రి శోభకరాంద్లజే తెలంగాణకు వచ్చి అభిప్రాయసేకరణ జరుపుతారని తెలుస్తోంది. ఇది ముగిశాక ఒకనేత పేరుతో నామినేషన్ పత్రాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి.. మరుసటి రోజు అధ్యక్షుడి ప్రకటన ఉండొచ్చునని అంటున్నారు. అధ్యక్ష పదవి కోసం పార్టీలో పాత–కొత్త నేతల మధ్య 'జాతివైరం'స్థాయిలో ఇప్పటికీ సాగుతోంది. పార్టీ సిద్ధాంతాలు, హిందుత్వ భావాలున్న పాత నాయకులకే ఈ పదవి ఇవ్వాలని కొందరు పట్టు పడుతున్నారు. పార్టీలో చేరాక, ఎంపీగా, ఎమ్మెల్యేగా లేదా మరో పదవికో ఎన్నికయ్యాక పాత–కొత్త అంటూ ఉండదని కొందరు (గత మూడు, నాలుగేళ్లలో చేరి ఆయా పదవులు పొందినవారు) వాదిస్తున్నారు. పార్టీలో కొత్తరక్తం నింపి వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అనేక మార్పులు చేయాల్సి ఉంటుందని ఈ వర్గం సూచిస్తోంది.

**అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ**

రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ముఖ్యనేతలు, సీనియర్ నేతలు, పాత%–%కొత్త నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

- ఈసారి బీసీ వర్గానికి చెందిన నేతకు అవకాశం దక్కొచ్చుననే ఊహాగానాలు ఎక్కువగా సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, బీజేఎల్పీ ఉపనేత పాయల్‌శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి తదితరులు పోటీపడుతున్నారు.
- ఇక ఓసీ నాయకుల విషయానికొస్తే ఎంపీలు డీకే అరుణ, ఎం.రఘునందన్‌రావు, ఇంకా పి.మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు.
- అధ్యక్ష పదవిని కోరుకుంటున్న వారిలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కూడా ఉన్నారు. అయితే కొన్నిరోజులుగా అనూహ్యంగా కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సంజయ్‌ను మళ్లీ అధ్యక్షుడిగా నియమించేందుకు బీజేపీ అధినాయకత్వం మొగ్గుచూపొచ్చుననేది ఈ ప్రచార సారాంశం. అయితే అధ్యక్ష పదవి కోసం తాను పోటీలో లేనంటూ తాజాగా సంజయ్ వివరణ ఇచ్చారు. అయినా, పార్టీని ముందుండి నడిపించేందుకు ఆయన్నే అధ్యక్షుడిగా నియమించే అవకాశాలున్నాయని కొందరు నేతలు చెబుతున్నారు. బీసీ నేతకు ఇస్తే ఈటల రాజేందర్‌కు దక్కొచ్చునని గతంలోనే ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. పీఎం మోదీ, సీనియర్ నేతలు అమిత్ షా, నడ్డా వంటివారు ఈటలకే ఓటేస్తారనే ప్రచారం జరిగింది.

గతంలో ఎన్నడూలేని విధంగా తనకే అధ్యక్ష పదవి వస్తుందంటూ కొందరు ముఖ్యనేతలు సైతం ప్రచారం చేసుకోవడం పట్ల రాష్ట్ర పార్టీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే తాను అధ్యక్షుడిని అవుతున్నానంటూ వారు మీడియాకు, అనుచరులకు లీక్‌లు ఇచ్చుకోవడం ఇటీవల బాగా పెరిగిపోయింది. పార్టీనాయకుల్లో ఇలాంటి పోకడలు గతంలో ఎప్పుడూ లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనే దానిపై రాష్ట్రపార్టీలో ఏకాభిప్రాయం కుదరని కారణంగానే జాతీయ నాయకత్వం కూడా డైలమాలో పడిందని సమాచారం. ఈ పరిస్థితుల్లో అధినాయకత్వం ఎవరి వైపు మొగ్గుచూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# జస్టిస్ వర్మ ఇచ్చిన తీర్పులన్నీ తిరగదోడాల్సిందే



న్యూఢిల్లీ, మార్చి 24: స్టోర్‌రూమ్‌లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మకు అన్ని వైపుల నుంచీ గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్రానికి అధికారికంగా సిఫారసు చేయగా.. ఢిల్లీ హైకోర్టు ఆయనకు కేటాయించిన న్యాయపరమైన విధులన్నింటినీ ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇప్పటిదాకా ఇచ్చిన తీర్పులన్నింటినీ తిరగదోడాలని, ఆయనపై అభిశంసనకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీజేఐను కోరుతూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సోమవారం ఒక తీర్మానం చేసింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని.. ఎఫ్ఐఆర్ నమోదుకు వెంటనే అనుమతించాలని, అవసరమైతే ఆయన్ను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించడానికి కూడా అనుమతించాలని అందులో కోరింది. ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, న్యాయవ్యవస్థకు ఉన్న ఏకైక శక్తి ప్రజా విశ్వాసమేనని.. ఒక్కసారి అది పోతే దేశం కుప్పకూలుతుందని ఆందోళన వెలిబుచ్చింది. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు బార్ అసోసియేషన్ ప్రకటించింది. "ఒక్క న్యాయమూర్తిని కాపాడడానికి మొత్తం ప్రజాస్వామ్యాన్నీ పణంగా పెడుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి. జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తూ మాకు 22 సంస్థలు మద్దతు లేఖలు పంపాయి. ఈ విషయంలో మేము తుదికంటా పోరాడుతాం. సుప్రీంకోర్టుకు న్యాయాధికారాలు ఉంటే, మాకు ప్రజా మద్దతు ఉంది" అని అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేన్ అధ్యక్షుడు అనిల్ తివారీ పేర్కొన్నారు. జస్టిస్ వర్మ బదిలీ విషయంలో సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాకే.. తాము విధుల్లోకి దిగుతామని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ సంరక్షణకు తమ ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర ఒక ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అందులో ఆయన ఈ వ్యవహారానికి సంబంధించి పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. కాలిన నోట్ల కట్టల వీడియో, ఫొటోలతో సహా 25 పేజీల డాక్యుమెంట్‌ను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం.. న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కొంతమేరకు తోడ్పడినప్పటికీ, జస్టిస్ వర్మపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని సామాన్యప్రజలు, మీడియా ప్రశ్నిస్తున్నట్టు ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. "మార్చి 14నే ఆయనపై ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదు? ఎటువంటి అరెస్టులూ ఆరోజే ఎందుకు జరగలేదు? అక్కడ దొరికిన డబ్బును (సగం కాలిన నోట్లను) ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? ఎటువంటి మహజరూ (జప్తు, సోదాలకు సంబంధించిన నివేదిక) ఎందుకు రూపొందించలేదు? క్రిమినల్ లాను ఎందుకు వర్తింపజేయలేదు? అసలు ఈ స్కాండల్ గురించి ప్రజలకు తెలియడానికి దాదాపు వారం రోజులు ఎందుకు ఆలస్యమైంది?" అని ఆయన తన పిటిషన్‌లో పలు ప్రశ్నలు సంధించారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం ద్వారా క్రిమినల్ ప్రొసీజర్‌ను అనుసరించడానికి బదులుగా.. సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీతో అంతర్గత విచారణకు ఆదేశించడం వల్ల ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగిందన్నారు.

# ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ, బిజినెస్, హెల్త్‌కేర్ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తుంది. ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. 2002లో స్థాపించిన జార్జియా యూనివర్సిటీ ఆ దేశంలో అతిపెద్ద వర్సిటీగా ఎదిగింది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు ఇంటర్నేషనల్ అక్రిడిటెడ్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్స్‌లో గ్లోబల్ కంపెనీలతో కొలాబ్రేషన్‌లో ఉంది. కార్యక్రమంలో జీఎన్‌యు వ్యవస్థాపకుడు గియా కావ్టెలిష్విలి, వైస్ రెక్టార్ జార్జ్ గవ్రాడ్జే, రాష్ట్ర అధికారులు కోన శశిధర్, భరత్‌గుప్తా పాల్గొన్నారు.

# ఎంపీల జీతాలు 24% పెంపు

(మొదటి పేజీ తరువాయి)

తాజా సవరణల ప్రకారం, ఎంపీల జీతం నెలకు రూ.1 లక్ష నుంచి రూ.1.24 లక్షలకు, నియోజకవర్గం అలవెన్స్ నెలకు రూ.70,000 నుంచి రూ.87,000కు, కార్యాలయం ఖర్చుల అలవెన్స్ నెలకు రూ.60,000 నుంచి రూ.75,000కు పెరిగాయి. ఒక్కొక్క ఎంపీకి రోజువారీ భత్యం రూ.2,000 నుంచి రూ.2,500కు పెరిగింది. మాజీ ఎంపీల పింఛను రూ.31,000కు పెరిగింది. ఐదేళ్లకు మించి పని చేసిన ప్రతి సంవత్సరానికి ఇకపై నెలకు రూ.2,500 పింఛను అదనంగా లభిస్తుంది. ఎంపీలు తమ పదవీ కాలంలో ఒకసారి రూ.1 లక్ష విలువైన మన్నిక గల ఫర్నిచర్‌ను, రూ.25,000 విలువైన నాన్ డ్యూరబుల్ ఫర్నిచర్‌ను కొనవచ్చు. సెంట్రల్ ఢిల్లీలోని విఠల్‌భాయ్ పటేల్ హౌస్ హాస్టల్, టూ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ వరకు రకరకాల వసతి సదుపాయాలను కూడా పొందవచ్చు.

# రాష్ట్రంలో పూర్తిగా పేదరిక నిర్మూలనే కార్యక్రమం లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎవరిపైనా ఒత్తిడి చేయవద్దని అధికారులకు సూచించారు. దాతలను, లబ్ధిదారులను ఓ వేదికపైకి తీసుకురావడం వరకే ప్రభుత్వ పాత్ర పరిమితం అని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరఫున ఎవరికీ అదనంగా ఆర్థిక సాయం అందబోదని వెల్లడించారు. లబ్ధిపొందే పేద కుటుంబాలను "బంగారు కుటుంబం"గా, సాయం చేసే సంపన్న కుటుంబాలను "మార్గదర్శి"గా పిలవాలని సీఎం సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో తప్పులు లేకుండా చూడాలని, తద్వారా సహాయం చేయడానికి ముందుకొచ్చేవారిలో స్ఫూర్తిని నింపాలని సూచించారు. వివాదాలకు తావులేకుండా, పారదర్శకంగా గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిదారుల తుదిజాబితాను రూపొందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పీ4 పథకానికి ఎలాంటి సంబంధం ఉండదని, సమాజంలో అట్టడుగున ఉన్న వారికి చేయూత అందించడమే పీ4 ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంపై ప్రజలు గందరగోళానికి గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒక్కరైనా హాజరయ్యేలా చూడాలని, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరిగేంతవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సీఎం తెలిపారు.

# అసెంబ్లీకి జగదీశ్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

చాంబర్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డిని సభ ఆవరణ నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కరుణాకర్ కోరారు. తనను సస్పెన్షన్ చేసినట్టు బులెటిన్ చూపిస్తే బయటకు వెళతానని జగదీశ్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. తాను అసెంబ్లీకి రావడంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. సాయంత్రం మూడు గంటలకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలోనే జగదీశ్‌రెడ్డి గడిపారు. అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోంది: రాజ్యాంగ విలువ లు, నిబంధనలు లేకుండా అసెంబ్లీ ఇష్టారాజ్యంగా నడుస్తోందని జగదీశ్‌రెడ్డి అ న్నారు. అసెంబ్లీ లాబీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నన్ను అసెంబ్లీ సమావేశాల నుంచి ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ కారణాలు, ఆ ధారాలు చూపడం లేదు. మందబలంతో సభ నడుపుతామంటే కుదరదు. కోర్టు కు వెళతాననే భయంతోనే నా సస్పెన్షన్‌కు సంబంధించిన బులెటిన్ విడుదల చేయడం లేదు. సభ్యులు వేసే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక ఏకంగా ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా మంత్రులు గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్లను వాడుతున్నారు. జాన్‌పాడ్‌లో జరిగిన దావత్‌కు కూడా మాజీమంత్రి జానారెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు'అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం..అయోమయం: బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా తయారైందని..అసలు ఏం జరుగుతుందో ముఖ్యమంత్రికే స్పష్టత లేక అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శాసనసభలో పద్దులపై చర్చలో భాగంగా సోమవారం రాత్రి ఆయన మాట్లాడారు. అసలు రాష్ట్రం మొత్తం అప్పులెన్ని.. వాటిపై చెల్లిస్తున్న వడ్డీ ఎంత.. కొత్తగా తెస్తున్న అప్పు ఎంత ? లాంటి వివరాలేవీ తెలపటం లేదని విమర్శించారు.



# రైతులకు ప్రభుత్వమే పూర్తిస్థాయిలో పరిహారం అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పడిపోయిన గెలలను కూడా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో భారీ ఈదురు గాలులు, అకాల వర్షాలకు నేలవాలిన అరటి తోటలను వైఎస్ జగన్ సోమవారం పరిశీలించారు. తాతిరెడ్డిపల్లె, కోమన్నూతలలో అరటి తోటల్లోకి వెళ్లి రైతులను ఓదార్చి నష్టాన్ని ఆరా తీశారు. కోమన్నూతల వద్ద తోటలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాలోని లింగాల మండలంతోపాటు అనంతపురం జిల్లాలోని నేర్జాంపల్లె, దాడితోట తదితర గ్రామాల్లో దాదాపు 4 వేల ఎకరాల్లో అరటి తోటులకు నష్టం జరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. అరటి రైతు ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చు పెట్టి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చే సమయంలో పెను గాలులు దెబ్బతీయడంతో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఆదాయం రాకపోగా, చివరికి నష్టం మిగలడం బాధేస్తోంది. రైతన్నలకు ఉచిత పంటల బీమా ఒక హక్కుగా వైఎస్సార్‌సీపీ హయాంలో అమలుయ్యేది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమాను ఎత్తేశారు. దీన్ని ఎత్తివేయడం ఒక నేరమైతే.. 2024 మే, జూన్ నెలల్లో కట్టాల్సిన పంటల ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని చంద్రబాబు కట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కట్టాల్సిన ప్రీమియం రూ.1,280 కోట్లు కట్టి ఉంటే రైతులకు మేలు జరిగేది. బాబు అధికారంలోకి వచ్చాక ప్రీమియం ఎగ్గొట్టడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ తర్వాత 2024–25కి సంబంధించిన ప్రీమియం కూడా ఆయన కట్టలేదు. అసలు ఈ రోజు ఉచిత పంటల బీమా ఉందా? లేదా? మీరిచ్చిన జీవోను చూస్తే దశల వారీగా ఎత్తేస్తామని చెబుతున్నారు. చంద్రబాబు పుణ్యాన ఇప్పటికే పలు పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ధాన్యం రంగు మారింది. మొక్కజొన్న, జొన్నకు కూడా భారీగా నష్టం వాటిల్లింది. వరుసగా రెండేళ్లు ఖరీఫ్ సీజన్‌లో అదే జరిగింది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టాలి. ఈ–క్రాప్ పక్కాగా నమోదు చేయాలి. ప్రతి రైతు పండించిన పంటల వివరాలు ఈ–క్రాప్ కింద నమోదు చేసి నష్టం జరిగితే వారికి ఇన్సూరెన్స్ వచ్చేలా చూడాలి. ఎవరూ ఇన్సూరెన్స్ కట్టలేదన్న పరిస్థితి ఉత్పన్నం కాకూడదు. మన ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద రైతన్నలకు ఏటా రూ.13,500 చొప్పున ఇచ్చాం.

సామాన్యుడి ఆయుధం
T/AP/2024/0304/1072/41
ప్రజల అస్త్రం
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
మంగళవారం 25-3-2025



## బెట్టింగ్ జోలికి వద్దు జీవితాలను నాశనం చేసుకోవద్దు

**సి ఐ ఖాజావలి**





కనిగిరి అస్త్రం ప్రతినిధి : క్రికెట్ బెట్టింగుల జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కనిగిరి సి ఐ ఖాజావలి అన్నారు. సోమవారం కనిగిరి మండలం పరిధిలోని అజీస్ పురం గ్రామం నందు జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఖాజావలి మాట్లాడుతూ కనిగిరి పరిసర ప్రాంతంలో క్రికెట్ బెట్టింగుల నిర్వాహకులు, పందెపు రాయుళ్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. క్రికెట్ బెట్టింగ్లకు పాల్పడిన, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని సి ఐ హెచ్చరించారు.బెట్టింగ్ యాప్ వల్ల తల్లిదండ్రులు నమ్ముకుని వచ్చిన భార్య పిల్లలు నమ్మి సహాయం చేసిన స్నేహితులు అందరూ రోడ్డున పడతారని జాగ్రత్తగా ఉండాలని అవగాహన కలిగించారు.జిల్లా ఎస్ పి ఏ. ఆర్ దామోదర్, కనిగిరి డి ఎస్ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాల మేరకు యువత బెట్టింగుల జోలికి వెళ్లకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.ఈ సందర్భంగా ఎస్ ఐ శ్రీరామ్ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్ పై అవగాహన కలిగించారు. బెట్టింగ్ యాప్స్ కి జోలికి వెళ్లొద్దని జీవితాలను నాశనం చేసుకోవద్దని బెట్టింగ్ యాప్స్ మాయలో పడవద్దని తెలిపారు.బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని అన్నారు.గతంలో బెట్టింగ్ ఆడినవారి జాబితా పోలీస్ డిపార్ట్మెంట్ వద్ద ఉందని వారి కదిలికలపై నిఘా ఉంచామని అన్నారు.తల్లిదండ్రులు కూడా వారి పిల్లల కదలికలు ప్రవర్తన గమనించాలని కోరారు.ఈ కార్యక్రమం లో పోలీస్ లు,గ్రామ సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఏనుబూరి ప్రభాకర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,రిటైర్డ్ ఎం ఈ ఓ నాగి రెడ్డి,ధనరాజు, రాజేష్,గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## హెూమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై శిక్షణ

యర్రగొండపాలెం అస్త్రం ప్రతినిధి : మండలంలోని యర్రగొండపాలెం రైతు సేవా కేంద్రం నందు యర్రగొండపాలెం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతు సేవ కేంద్ర సిబ్బందికి, వ్యవసాయ అధికారులకు హెూమ్ కంపోస్టింగ్, పోషక, కిచెన్ గార్డెన్ మరియు మిద్దె తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం సహాయ వ్యవసాయ సంచాలకులు కె. నీరజఅధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీటీసీ డిఆర్ సి ఎస్ రామ్మోహన్ వివిధ రకాల కంపోస్టు పిట్లు తయారీ గురించి, మిద్దె తోటలు, ప్రతి తోటలు పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలనువివరించారు. రైతు సేవ కేంద్ర సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పూర్తి సమాచారాన్ని తెలుసుకొని వారి సందేహాలను కూడా నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు, డి ఆర్ సి,ఎ డి ఎ, జే .వెంకట్రావు హైడ్రోఫోనిక్ కల్టివేషన్ పై వివరించారు,డిఆర్సి వ్యవసాయ అధికారులు వి వెంకట శేషమ్మ, ఏ శైలజరాని, హెూమ్ కంపోస్టింగ్ పోషక కిచెన్ గార్డెన్, పెరటి మిద్దె తోటల పెంపకం గురించి పి పి టి ద్వారా వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి పి. ఆదిరెడ్డి ఉద్యానశాఖ లో అమలులో ఉన్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,నాలుగు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.







# ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి రక్ష

## ఏవో విజయ్ కుమార్

కొండపి అస్త్రం ప్రతినిధి : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే భూమి ఆరోగ్యం ఉంటుందని ఆ పంటలు తినటం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాము రోగాలు అరికట్టవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయకుమార్ అన్నారు.స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన వెలుగు సిబ్బందులతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ పై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ ఎంటి ఎస్తేరు మాట్లాడుతూ మండలంలోని ప్రకృతి వ్యవసాయ గ్రామాల్లో రైతులు తమకు పొలంలో నవధాన్యాలు తప్పనిసరిగా వేసుకోవాలి. ఒక ఎకరంలోనైనా ప్రకృతి వ్యవసాయ సాగు చేయాలి రైతులు ఒకే పంటలు వేయకుండా పలు పంటలు వేయటం వల్ల అధిక ఆదాయం లాభం పొందవచ్చున్నారు. ప్రతి మహిళా సంఘం ఇంటి దగ్గర కూరగాయల సాగు చేసుకుని ఇంటి ఖర్చులను తగ్గించుకోవచ్చు అని కొండపి మండల ఏపీఎం గోపి నాథ్ తెలిపారు. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయ సాగు చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటాము అలానే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ప్రతి మహిళా సంఘంలో ఉన్న మహిళా సభ్యులందరూ కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలి ఇంటి దగ్గర పెరటి తోటలు పెంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా నుండి డిపిఎం ఆఫీస్ సిబ్బంది ఝాన్సీ, యూనిట్ ఇన్చార్జి రంజిత్,ఐ. సి.ఆర్. పి లు, వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ,వి ఏ ఏ లు,రైతు సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ప్రకృతి వ్యవసాయం పద్ధతులలో పంటలు పండిస్తున్న అభ్యుదయ రైతులకు సాలువ కప్పి సత్కరించారు.




## కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయి

**సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ**

దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : ప్రజలను డబల్ ఇంజన్ సర్కార్లు మోసం చేశాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విమర్శించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయాయన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలో ఏఐవైఎస్ జిల్లా అధ్యక్షుడు వేమల కన్నబాబు అధ్యక్షతన సీపీఐ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఎంతో మంది ఉద్యమకారులు ప్రాణాలను త్యాగం చేసి విశాఖ ఉక్కుని సాధిస్తే, దానిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడాకి సిద్ధపడటం ప్రజలనుదగా చెయ్యడమే అవుతుందన్నారు. గోవాడ చెక్కర కర్మాగారం ఉనికి కోల్పోయే స్థితిలో ఉన్నా దానిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కనీసం ప్రయత్నించడం లేదన్నారు. సూపర్ 6 పథకాలను అమలు చెయ్యలేని చేతగాని ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ఏలుతోందన్నారు. అప్పులు తెచ్చి గొప్పలు చెప్పుకునే ఈ ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేస్తాయనే నమ్మకం పూర్తిగా పోయిందన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడటానికి ఇప్పటి నుంచే ప్రజలు సన్నద్ధంకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు వియ్యపు రాజు కాసుబాబు, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో మండల కార్యదర్శిగా కన్నబాబు, సహాయ కార్యదర్శిగా రాయి సింహాద్రప్పడుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు

**తహసిల్దార్ కిషోర్ లింకన్**



చీడికాడ అస్త్రం ప్రతినిధి : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక మట్టి గ్రావెల్ తర్లిస్తే చర్యలు తప్పు అని స్థానిక తహసిల్దార్ కిషోర్ లింకన్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇసుక తీసే రీచ్లు లేవని తెలిసిందన్నారు. గుర్తింపు పొందిన రిచ్ ల నుండి ఇసుకను అనుమతి పత్రాలతో తరలించాల్సి ఉందన్నారు. ఇదే కాకుండా మట్టి గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిబంధన అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ఉత్తమ డూప్ కృష్ణగా పరదేశి ఎంపిక.

గుర్తించిన ఆల్ ఇండియా కళా రంగం

పరదేశికి ఘన సన్మానం



చీడికాడ అస్త్రం ప్రతినిధి : సూపర్ స్టార్ కృష్ణకు డూపుగా నటిస్తూ తనదైన ముద్రను వేసుకున్నారు చీడీ కాడకు చెందిన ఈన్ ద్రపు పరదేశి. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో డూప్ కృష్ణల ను ఎంపిక చేయడంతో పరదేశి మొదటి స్థానంలో నిల్చున్నారు. ఇటీవల ఆల్ ఇండియా కళారంగం ఉత్తమ డూప్ కృష్ణ ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టి రెండు రాష్ట్రాలకు చెందిన డూప్ కృష్ణ లను తమ తమ కార్యాలయంలో వీడియోలు చేసి పెట్టాలని ఆదేశించింది. దీంతో రెండు రాష్ట్రాల నుండి 45 మంది తాము నటిస్తున్న వీడియోలను పెట్టగా వీడియోలను పరిశీలించిన ఆల్ ఇండియా కళా రంగం ప్రతినిధులు ఆంధ్ర ప్రదేశ్ లోని అనకాపల్లి జిల్లా చీడికాడ మండల కేంద్రానికి చెందిన పరదేశిని ఉత్తమ డూప్ కృష్ణగా ఎంపిక చేసింది. దీంట్లో భాగంగా ఆల్ ఇండియా కళారంగం ప్రతినిధులు రవి, బాలు చీడికాడ లోని పరదేశి ఇంటికి వచ్చి ఆయన్ని ఘనంగా సత్కరించే మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రమేష్, శంకర్, పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత



**దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి :** క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు పాటిస్తే పూర్తిగా నయం చేయవచ్చని పీహెచ్సీ వైద్యాధికారి వనజ తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడారు. క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ బ్యాక్టీరియా సాధారణంగా దగ్గు, తుమ్ముల సమయంలో గాల్లోకి విడుదలయ్యే చిన్న బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. టీబీ వ్యాధి ఉన్న వ్యక్తి దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు పాడినప్పుడు, నవ్వినప్పుడు వారు టీబీని వ్యాప్తి చేస్తారు. తద్వారా బరువు తగ్గడం, నిరంతర దగ్గు,రాత్రిపూట చెమటలు పట్టడం విపరీతమైన జ్వరం ఉన్నట్లయితే వైద్యుల్ని సంప్రదించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఎం. ఆనంద్ హెల్త్ సూపర్వైజర్ పుష్ప రాజ్, పి హెచ్ ఎన్, హెచ్ వి, ఏఎన్ఎం లు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.హెచ్ఎస్సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం 25-3-2025

# అవసరమైతే అమరావతిలో ఆందోళన !

## ఆదివాసీలు సాగు అనుభవంలో ఉండగా రికార్డులు మార్చేసిన తహసిల్దార్ ?

## గొలుగొండ తాహసిల్దార్ పై చర్యలు తీసుకోవాలి!




అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో: తాసిల్దార్ మార్పులను వెంటనే సస్పెండ్ చేయాలనే డిమాండ్ చేస్తూ , 24 సోమవారం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఆదివాసీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాని ఉద్దేశించి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే జనార్ధన్ మాట్లాడుతూ,పాత మల్లంపేట రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 850లో అమెరికాకి చెందిన దుగ్గిరాల బాలకృష్ణ సాగు అనుభవంలో ఉన్నాడని చూపిస్తూ, ఫిబ్రవరి 24వ తారీఖున గొలుగొండ తాసిల్దార్ శ్రీనివాసరావు భూమి రికార్డులను సృష్టించాడని, 50 సంవత్సరాల కిందట దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయి అక్కడ పౌరుడైన వ్యక్తి దుగ్గిరాల బాలకృష్ణ. ఈ 50 సంవత్సరాల కాలంగా గదబపాలెం ఆదివాసీలు సాగు అనుభవంలో ఉన్నారన్నారు. ఆ భూములలో వారు పెంచిన జీడి మామిడి తోటలు, ఇతర వృక్షాలు, వారు కట్టుకున్న ఇల్లు, దేవాలయం, చర్చి ఇ%శీ%దుకు సాక్షి భూతంగా ఉన్నాయనిని జనార్ధన్ అన్నారు. 2023 జనవరి 3న అప్పటి రెవిన్యూ డివిజనల్ అధికారి నర్సీపట్నం వారు జిల్లా కలెక్టర్ కు రాసిన నివేదికలో ఆదివాసీల సాగు అనుభవంలో ఉన్న విషయాన్ని నిర్ధారించారని జనార్ధన్ గుర్తు చేశారు. ఆదివాసీలు తాము సాగు అనుభవంలో ఉన్నామని తమకు నోటీసు ఇవ్వకుండా ఎటువంటి మార్పులు రికార్డులు చేయకూడదని పాత మల్లంపేట గ్రామ పరిపాలన అధికారి, గొలుగొండ మండలం తాసిల్దార్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నర్సీపట్నం, జిల్లా కలెక్టర్ అనకాపల్లి గార్లకు నోటీసులు ఇచ్చి ఉన్నారని, అయినా వాటిని ఖాతరు చేయకుండా ప్రస్తుత తాహసిల్దార్ పి శ్రీనివాసరావు రికార్డును ఏకపక్షంగా మార్చేశాడనీ జనార్ధన్ ఆరోపించారు. సర్వేనెంబర్ 850లో 36 ఎకరాల భూమిలో తమకు బాగాస్వామ్య హక్కులు ఉన్నాయని తెలియజేస్తూ, తమకు నోటీసు ఇవ్వకుండా ఎటువంటి మార్పులు చేయరాదని ఇతర వాటాదాల్లు జిల్లా రెవిన్యూ అధికారులకు, తాహసిల్దార్ కు తమ న్యాయవాది ద్వారా 2022లోనే లీగల్ నోటీస్ ఇచ్చి ఉన్నారనీ అయినా భారీ లంచాలకు ఆశపడి 5 కోట్ల రూపాయల విలువైన భూమిని తాహసిల్దార్, పాత మల్లంపేట గ్రామ పరిపాలన అధికారి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేల సహకారంతో రికార్డు మార్చేసి అధికారి దుర్వినియోగానికి పాల్పడి ఆదివాసిప్రయోజనాలను దెబ్బతీయడానికి ప్రయత్నం చేసిన అధికారులపై జిల్లా యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసి సంఘం జిల్లా కన్వీనర్ మోసూరీ రాజ డిమాండ్ చేశారు. ఆదివాసీలకు న్యాయం జరిగేంతవరకు తాము పోరాడుతామని, అవసరమైతే విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తామని ఆదివాసి సంఘర్ష్ మూర్ఛ ( ఏ ఎస్ ఎం) రాష్ట్ర అధ్యక్షులు రేచుకట్ల సింహాచలం అన్నారు. సవరల గణేష్ సిపిఐ ఎంఎల్ లిపరేషన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు గోలుగోండ మండలం పాత మల్లంపేట పంచాయతీ సర్పంచ్ ఆదిలక్ష్మి ఆనందు నర్సీపట్నం బిఎస్.పి పార్టీ ఇన్చార్జి నర్సీపట్నం బొట్ట నాగరాజు పాల్గొన్నారు.గదబపాలెం ఆదివాసీలకు సంఘీభావంగా వివిధ మండలాల నుంచి ఆదివాసీలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు.

# ఎడ్ల వీధిలో ఆక్రమణకు గురైన పంచాయితీ స్థలం !!!

## చోద్యం చూస్తున్న పంచాయతీ సిబ్బంది

## సి.పి.ఐ. జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు

చోడవరం అస్త్రం ప్రతినిధి : భారత కమ్యూనిస్టు పార్టీ అనకాపల్లి జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ప్రజా ఫిర్యాదులు మేరకు సోమవారం చోడవరం ఎడ్లవీధి లో ప్రజా మౌలిక అవసరాలు కాలవలు, మంచినీరు, వసతులు పై పరిశీలన జరిపారు. ఈ పర్యటనలో చోడవరం మేజర్ పంచాయతీ ఎడ్ల వీధిలో ఉన్న పంచాయితీ బోరు, స్థలం ఆక్రమణకు గురైన ఆ కా విషయాన్ని అధికారులు స్పందించకపోవడం దీనికి నిదర్శనం అన్నారు, చోడవరంలో పంచాయతీ అధికారులు లంచాలు అలవాటు పడి పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తున్న పట్టించుకోని పంచాయతీ అధికారులు చోడవరం ఎడ్ల వీధిలో సంవత్సరాలు తరబడి ప్రజలు ఉపయోగించే పంచాయతీ గ్రామ కంట స్థలంలో మంచినీటి బోరు తో కలిపి పంచాయతీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు రాత్రికి రాత్రి ప్రహరీ కూడా కట్టేసి ఆక్రమించుకున్న అధికారులు కాసులు కక్కుర్తి పడి పట్టించుకునే పరిస్థితి లేదని అక్కడ నిర్వాసితులు చెప్తున్నారు. ఎడ్ల వీధి ప్రజలు అధికారులకు తెలియజేసిన పట్టించుకునే పరిస్థితి లేదు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టే ఆక్రమించిన పంచాయతీ స్థలాల్లో ఉన్న ప్రహారీ గోడను తొలగించి ప్రజలకు ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ




అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేస్తున్నారు .ఎడ్ల వీధి నిర్వాసితులతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడి చేయవలసిన అవసరం ఏర్పడుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

# రసావతరంగా జరిగిన కించుమండ సంత వేలం పాట

## పాట దక్కించుకున్న,నరసయ్య

## “2లక్షల 48వేల 5వందలకు చేరిన పాట

## ఈ.ఓ.పి.ఆర్.డి,విజయ్ కుమార్.



దుంబ్రిగూడ అస్త్రం ప్రతినిధి : మండలం కించుమండ పంచాయతీ కేంద్రంలో బుధవారం నాడు జరిగే వారపు సంత వేలం పాట ఈ రోజు సోమవారం పంచాయతీ సర్పంచ్ హరిబారికి చెల్లమ్మ ఆధ్వర్యంలో కించుమండ గ్రామ పంచాయతీ భవనం నందు నిర్వహించారు .ఈ సంత వేలం పాటకు ప్రత్యేక అధికారిగా ఈ ఓ పి ఆర్ డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటుగా కించుమండ గ్రామ వార్డు మెంబెర్స్ గ్రామ ప్రజల సమక్షంలో సర్కారు వారి పాట2,లక్షల 15వేల తో ప్రారంభించారు. రసవతారంగా జరిగిన పాటలో హరిబారికి నరసయ్య అనే పాటదారుడు పాటను 2లక్షల 48వేల 5వందల రూపాయు లకు దక్కించుకొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ పాటదారునికి అభినందనలు చెబుతూ ఈ వేలం పాట వారపు వసూలు నిమిత్తం జరుగుతుందని వసూలు చేసిన ప్రతి రూపాయి పంచాయతీ లో సమస్యలు డ్రైనేజీ క్లినిక్ సంత క్లినిక్ తో పాటుగా మంచినీటి, సమస్య వీధి దీపాల వంటి సమస్యల కు ఉపయోగిస్తామన్నారు.గ్రామపంచాయతీ పరిధిలో ఈ సొమ్మును ఉపయోగించడం జరుగుతుంది . ఎంతో ఆశతో వేలం పాటలో 2వేలు రుసుము చెల్లించి పోటీలో పాల్గొనీ వెనుతిరిగిన వారి 2 వేల రూపాయు లు తిరిగి రెండు రోజులలో చెల్లించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమం లో గ్రామ సచివాలయ సిబ్బంది, వార్డు మెంబెర్స్, గ్రామ ప్రజాలు పాల్గొన్నారు.



# వాసవి జాగృతి గవర్నర్ గా వెంకట మాధవ్ ప్రమాణ స్వీకారం

**చోడవరం అస్త్రం ప్రతినిధి :** అనకాపల్లి జిల్లా వాసవి జాగృతి గవర్నర్ గా చోడవరం చెందిన శ్రీనాథ్ వెంకట మాధవ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరులో జరిగిన వాసవి జాగృతి అంతర్జాతీయ సమావేశం లో జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేశారు. గవర్నర్ గా ఎస్.వి మాధవ, వైస్ గవర్నర్ గా మాడుగుల కు చెందిన శ్రీనాథ్ శ్రీనివాసరావు, క్యాబినెట్ సెక్రటరీగా కందుకూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా తమ్మన సుబ్రమణ్య గుప్తా లను నియమించారు. అనంతరం వెంకట మాధవను వాసవి జాగృతి అంతర్జాతీయ కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ అధ్యక్షులు తిరువీధి వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

# సమస్యలపై సీ పి ఎం సర్వే



చోడవరం అస్త్రం ప్రతినిధి : చోడవరం కోటవీది లో సి.పి.ఎం. ఆధ్వర్యంలో మహిళా నాయకురాలు గూనూరు వరలక్ష్మి స్థానిక సమస్యలపై సోమవారం సర్వే నిర్వహించారు. డ్రైనేజీ వాటర్ సమస్యలు ఆదికంగా ఉన్నాయి.డ్రైనేజీ, వాటర్ టాంక్ ల్లో క్లోరినేషన్ (బ్లీచింగ్ కొట్టడం) గానీ, కాలువల్లో ఎక్సరైజ్ చేసిన పక్కన కుమ్మరి వీధి వెంకటేష్వా వెనుక కళ్యాణ మండపం ఎదురుగా మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు నుంచి రత్న హొటల్ వరకు తీత తీయడం గాని, కనీసం దోమల మందు కూడా కొట్టడం లేదని వీధిలో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపారిశుధ్య వాతావరణంలో అంటు వ్యాధులు వ్యాప్తితో దోమలు, ఈగలు క్రిమి కీటకాలు తో సహవాసం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కరెంటు స్తంభం లేదని వేయాలని తెలియజేశారు. జల జీవన స్రవంతి పేరుతో రోడ్లు మొత్తం గత ప్రభుత్వ హయాంలో తవ్వి ఇంటింటి కొళయిలు వేసారని, కానీ పంచాయితీ కొళాయిలు ఉన్నప్పుడు త్రాగు నీరు సరిపడా ఉండేదని, ఇప్పుడు అసలు చుక్క నీరు కూడా రావడం లేదని మహిళలు తెలియజేశారు. స్టానిక ప్రజా సమస్యలపై సచివాలయాల వద్ద సిపిఎం పార్టీ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు గూనూరు వరలక్ష్మి తెలియజేశారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ సందర్భంగా ర్యాలీ

**ముంచంగి పుట్టు అస్త్రం ప్రతినిధి :** మండల కేంద్రంలోని ముంచంగిపుట్టు లో ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు తీసుకోవలసినజాగ్రత్తలు విద్యార్థులకు పుర ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఓ టి సిడాక్టర్ శ్యాం ప్రసాద్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిహెచ్ఎన్ సి అధికారిని కే గీతాంజలి, డాక్టర్ పి శిరీష, డాక్టర్ ఎం రమేష్ కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కే సుబ్రహ్మణ్యం ఆరోగ్య విస్తరణ అధికారి, హెచ్ వి సిహెచ్ వేదవతి, బి కృష్ణవేణి, వి కిషోర్ కుమార్, పీఎంఓ, ఎమ్మెల్ హెచ్ పి ఎస్, ఏఎన్ఎం, టీవీ కంట్రోల్ సూపర్వైజర్ సిహెచ్ మూర్తి పాల్గొన్నారు.



సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
5
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం 25-3-2025



# ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని నిరసన

## అంబేద్కర్ ను అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

### దేవరాపల్లిలో కొవ్వొత్తుల ప్రదర్శన



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైవాడ అతిథి గృహం వద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం మాట్లాడుతూకుల గణన తర్వాత ఎస్ సి వర్గీకరణ చేయాలని, ఈలోపు వర్గీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌రంజాన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక తప్పులతడకగా ఉందని విమర్శించారు. వర్గీకరణ విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా చేసే ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. తక్షణమే దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జైభీమ్, అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం నాయకులు సబ్బవరపు మాలిబాబు, మచ్చా రామారావు, కన్నాబత్తుల రాజు, మచ్చా మహేష్, తాడి అప్పారావు, కదారి రాజు, రొప్పల రాజు, సబ్బవరపు కొండలరావు, సంతోష్, చంద్రశేఖర్, రొప్పల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# నేడు సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు విద్యుత్ కు అంతరాయం

**కొయ్యూరు అస్త్రం ప్రతినిధి :** కొయ్యురు మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో పెయింటింగ్ ఇతర మరమ్మత్తు పనులు చేపట్టడం వలన మంగళవారం (25న) ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా కాకరపాడు,సింగవరం, రాజేంద్రపాలెం, చింతువాని పాలెం, పిట్టచలం, నడింపాలెం, ఎం. మాకవరం, చింతలపూడి, గింజర్తి, చీడిపాలెం, దొడ్డవరం, మర్రివాడ,గుడ్లపల్లి,బూదరాళ్ల,లూసం, మంప, రేవళ్లు, తుమ్మలబంద గ్రామాలకు విధ్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ వీ ఎన్ ఎం. అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు.

# ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**కొయ్యూరు అస్త్రం ప్రతినిధి:** కొయ్యురు మండల కేంద్రంలో రాజేంద్రపాలెం వైద్యాధికారి అధ్యర్యంలో సోమవారం నాడు ప్రపంచ క్షయ వ్యాధి నిర్ములనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధి నిర్ములన అందరి భాద్యత అనే నినాదాలతో పలు పాఠశాల విద్యార్థులతో మండలకేంద్ర రహదారులపై ర్యాలీ నిర్వహించారు. అలాగే ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో అడిషనల్ డీ ఎం హెచ్ ఓ ప్రతాప్ రికార్డులు తనిఖీ చేసారు.

# బి.కింతాడలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

## తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు



**దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి :** మండలంలోని బోయిలకింతాడ గ్రామంలోని మెయిన్ రోడ్ సెంటర్లో, ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవరాపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ టి. మల్లేశ్వరరావును తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విడుదల సత్యారావు, బొబ్బిలి సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.




# ఈ కేవైసీ కై ఆధార్ కేంద్రంలో బారులు తీరిన జనం

## ఒకే ఆధార్ కేంద్రం తో తప్పని తిప్పలు

## రేషన్ కార్డు ఈ కేవైసీ గడువు పెంచాలి

**ముంచింగిపుట్ అస్త్రం ప్రతినిధి:** రాష్ట్ర పౌరసరఫరాల అధికారులు రేషన్ కార్డులో సభ్యులు నమోదు, లోపాల సవరణపై ప్రభుత్వం దృష్టి సారించిన తరుణంలో రేషన్ కార్డుల్లో నమోదైన ప్రతి ఒక్కరు ఈ నెల 31లోగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఈకేవైసీ పూర్తి కాకపోతే ఏప్రిల్ నెల బియ్యం సరఫరా ఆగిపోతుందని పౌరసరపరాల శాఖ అధికారులు తెలపడంతో అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండల ప్రజలు ఆధార్ కేంద్రం వద్ద పరుగులు పెట్టారు. అయితే ఎక్కువమంది ఐదు నుండి పది సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఈ కేవైసీ కానీ వాళ్ళు ఉండడంతో పిల్లల ఆధార్ అప్డేట్ కొరకు మండలంలో గల ఆధార్ కేంద్రంలో సోమవారం మారుమూల పంచాయతీల నుండి వచ్చిన జనంతో ఆధార్ కేంద్రం కిక్కిరించింది. అయితే మండల కేంద్రంలో ఒకటే ఆధార్ కేంద్రం ఉండడంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పిల్లలు, తల్లితండ్రులు ఎండ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆధార్ కేంద్రం ఒకటే ఉండటం అక్కడ అధికంగా జనాభా ఉండడంతో పని పూర్తికాక వెనుతిరగవలసిన పరిస్థితి ఏర్పడింది. పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డ్ ఈ కేవైసీ ఈనెల 31 తోనే చేయించుకోవాలని చెప్పడం, ఆధార్ కేంద్రంలో వెళితే బారులు తీరిన జనంతో పిల్లల బయోమెట్రిక్ త్వరగా తీసుకోకపోవడంతో గంటల తరబడి సమయం పడుతూ పని పూర్తి కాకపోవడం, మరోవైపు గడువు సమయం దగ్గర పడుతుండడంతో ప్రజలకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మండల కేంద్రంలో రెండు మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి రేషన్ కార్డ్ ఈకేవైసీ గడువును పెంచాలని మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనులు కోరుతున్నారు.

# అల్యూ మినియం కార్మికులు ఇల్లు స్థలాలు ఇవ్వాలి

**అనకాపల్లి అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో:** అనకాపల్లి లో అల్యూ మినియం (టపాలు, బిందెలుతయారు) పనిచేస్తూ జీవిస్తున్న కార్మికులు కూటమి ప్రభత్వం అర్హులైన వారికీ ఇల్లు స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇల్లు కట్టి యివ్వాలని అనకాపల్లి అల్యూ మినియం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ )ప్రధాన కార్యదర్శి బుద్ధవీర భద్ర రావు డిమాండ్ చేశారు స్థానిక గవర పాలెం శ్రీ నూకాలమ్మ ఆర్చి వద్ద సంఘం వన సమారాధన కార్యక్రమం జరిగింది కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కోన లక్ష్మణ హాజరై మాట్లాడుతూ రేడిమెడీ వస్తువులు వచ్చిన తర్వాత అల్యూ మినియం కంపేని లో కార్మికులు పని లేకుండా పోయింది అన్నారు. ప్రభుత్వం కార్మికులు కార్పొరేషన్ రుణాలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం సంఘంఅధ్యక్షులుగా పదవి విరమణ పొందిన నిలకంఠ శ్యామ్ కు సభ్యులు చిరు సత్కరించారు. సంఘం గౌ రవ అధ్యక్షులు కొండూరు వీరచారి మాట్లాడుతూ శ్యామ్ సంఘం అధ్యక్షులు గా ఉండి చేసిన సేవలు కొనియాడారు కార్యక్రమం లో సంఘం సీనియర్ నాయకులు ప్రేరాజు,సహాయ కార్యదర్శి ,కె. శ్రీను,కోశాధికారి కొండూరు. గిరిబాబు, పెంట కోట శ్రీనివాస్, ఈగల అప్పారావు, పాల్గొన్నారు.



# ఉగాది సందర్భంగా పీ4 ప్రారంభం

## పేదలకు అండగా నిలవడమే లక్ష్యం

## పీ4పై చంద్రబాబు సమీక్ష

ఉగాది సందర్భంగా అమరావతిలో పీ4 ప్రారంభం అవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సాయం అందించే చేతులకు వేదిక పీ4 అని అన్నారు. సంపన్నులు - పేదలను ఒకేచోటకు చేర్చడమే దీని లక్ష్యమని తెలిపారు. ఎన్నారైలతో సహా స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకురావొచ్చని కోరారు. పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్ పీ4 పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీ4 విధానానికి తుదిరూపు ఇచ్చారు. పేదలకు అండగా నిలిచేవారు మార్గదర్శకులని, లబ్ధి పొందేది బంగారు కుటుంబం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నదని తెలిపారు. 2029 కల్లా పేదరికాన్ని నిర్మూలించాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు. సంపన్నులు-పేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రూపొందించినట్లు చంద్రబాబు తెలిపారు. అ విధానంలో భాగస్వాములు కావడానికి ఎన్నారైలతో సహా ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చన్నారు. ఈ విధానం అమలు తీరుపై సీఎం స్పష్టత ఇచ్చారు. పీ4 అమల్లో భాగంగా.. తొలుత గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిపొందే కుటుంబాల జాబితా రూపొందిస్తారు. ఉగాది పండుగ రోజు అమరావతిలో పీ-4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చెప్పారు.


సామాన్యుడి ఆయుధం
# అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం 25-3-2025


# కూలీలు కాదు విద్యార్థినీలే!

## కేజీబీవీలో మూటలు మోస్తున్న విద్యార్థినిలు?

## చదువు నేర్పుతున్నారా పనులు నేర్పుతున్నారా?

## పర్యవేక్షణ లోపం విద్యార్థులకు శాపం?





**ముంచంగి పుట్ట అస్త్రం ప్రతినిధి :** కూలీ నాలి చేసి తమ పిల్లలు భవిష్యత్తును తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు భావిస్తారు. తమలా తమ పిల్లలు కష్టపడకూడదని విద్యాబుద్ధులు నేర్చుకోవాలని పాఠశాలల్లో చేర్పిస్తే ఉపాధ్యాయుల నిర్లక్ష్యం పుణ్యమా అని విద్యాబుద్ధులు కాకుండా పనులు చేస్తున్న వైనాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం పుణ్యమా అని ఉపాధ్యాయులు కూలి మనసులను పెడితే డబ్బులు అయిపోతుందని భావించి విద్యార్థులచే మూటలు మోయిస్తున్న సంఘటన అల్లూరి సీతా రామరాజు జిల్లాలోని ముంచింగి పుట్టులో చోటుచేసుకుంది.విద్యాబుద్ధులు నేర్పించవలసిన ఉపాధ్యాయులే విద్యార్థినిల చేత వెట్టి చాకిరీ చేయిస్తున్న వైనం కిలగాడ పంచాయతీ కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ పాఠశాలలో సోమవారం దర్శనమిచ్చింది. సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం వసతి గృహంలో గల విద్యార్థినీలకు ప్రభుత్వం అందజేసే నిత్య సరుకులు బియ్యం తదితర సామాగ్రిని పాఠశాల ఆవరణంలో లారీ తో దించిన పిమ్మట విద్యార్థినిల చేత బియ్యం బస్తాలు మోహించుకుని వారిచేత వెట్టి చాకిరి చేస్తున్నారని పలు విమర్శాలు తావిస్తుంది. మండలంలో గల అనేక వసతి గృహాల్లో ఇదే పరిస్థితి నెలకొందిని అధికారుల తనిఖీలు చేపట్టకపోవడం చూసి చూడనట్టుగా వ్యవహరించడంతోనే ఇష్టానుసారంగా విద్యార్థుల చేత వెట్టిచాకిరి చేయిస్తున్నారని విద్యార్థినిల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించిన విద్యాశాఖ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యానే బోధించాలని వారిచేత బరువులు మోహించడం పెట్టి చాకిరి పనులు చేయించడం మానుకోవాలని తల్లితండ్రులు, జిల్లా స్థాయి అధికారులను కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు చే పనులు చేయించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహకులు కాసులకు కక్కుర్తి పడుతూ విద్యార్థులచే పనులు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. తమ పిల్లలచే ఇలా పనులు చేయిస్తే ఊరుకుంటారా అనే అభిప్రాయాలు లేకపోలేదు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు స్పందించి ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# రామాలయ భూమి ఆక్రమణ తొలగిస్తాం :తహసిల్దార్

ముంచంగి పుట్ట అస్త్రం ప్రతినిధి : ముంచంగిపుట్ రామాలయం ఆలయం కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామాలయ భూమి ఆక్రమణను తొలగిస్తామని తహసిల్దార్ తెలిపారు. రామాలయానికి చెందిన భూమి అక్రమ జరిగిందనిసర్వే నిర్వహించే ఆక్రమణలు తొలగించాలంటూ మండలప్రజ పరిషత్ అభివృది కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం లోఒక వినతి పత్రం వచ్చినట్లు మండల తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించినస్పందన లో కించయిపుట్ పంచాయితి ముంచ%శీ%గిపుట్లోని శ్రీ రామాలయ యూత్ కమిటీ సభ్యులు గుడి మొత్తం 32సెంట్లు లెక్క ప్రకారంఉందని దానికి విరుద్ధంగా 16సెంట్లు ఆక్రమణకు గురైందని, గుడికి ఎంత భూమి ఉంటే అంతే సర్వే చేసి ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చారనిఆమె తెలిపారు.రామా లయంఎన్ని సెంట్లు ఉన్నది సర్వేచేసి సరి చేస్తామని ఆక్రమణకు గురైఉంటే గుర్తించి చర్యలుతీసుకుంటా మన్నారు.అనంతరం ఇన్చార్జి ఎంపిడిఓ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు మేరకు ప్రతి సోమవారము మండలస్థాయి అదికారులు స్పందన కార్యక్రమాన్ని తప్పని సరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమం లో ఇఓ పీఆర్డి వి చిన్నాన్నపాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి జనసైనికులు భారీ విరాళం



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని తెనుగుపూడి పంచాయతీ గొల్లపేటలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి ఆలయానికి తెనుగుపూడి గ్రామ జనసేన నాయకులు 30 వేల రూపాయలు, జనసేన పార్టీ దేవరాపల్లి మండల అధ్యక్షులు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు 5 వేలు, ఆలయ కమిటీ వారికి సోమవారం 35 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మాలిపిరెడ్డి రాంచరణ్, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు విసరపు మహేష్, కార్యదర్శి శివశంకర్, అచ్చుతారావు, కే మహేష్, గోకాద దేముళ్ళు, వి.గౌరీ నాయుడు, రవికుమార్, కే. శ్రీనివాసరావు జన సైనికులు పాల్గొన్నారు.

# అవినీతిలో తేలియాడి నీతి వాక్యాలా

## మాజీమంత్రి విడుదల రజనిపై ప్రత్తిపాటి ఆగ్రహం



అవినీతి మంత్రిగా ముద్ర వేయించుకున్న మాజీమంత్రివిడుదల రజనీ, ఈ రోజు నీతులు చెబితే ప్రజలు నమ్ముతారా అని తెలుగుదేశం చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు ఉలికిపాటు ఎందుకని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కేసులు పెట్టిన వారిని తిరిగి డబ్బులిస్తామని ఎందుకు బతిమాలుకుంటున్నారని ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. చేసిన తప్పులు కడుక్కోవడానికి జీవితం సరిపోదు, సొంతపార్టీ వారే ఇంకా క్యూలో ఉన్నారని తెలిపారు. ఆమె నీతి వాక్యాలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని విడదల రజనీకి ప్రత్తిపాటి పుల్లారావు కౌంటర్ ఇచ్చారు. సోమవారం ప్రత్తిపాటి పుల్లారావు మీడియాతో మాట్లాడారు. అధికార గర్వంతో చేయాల్సిన అరాచకాలు, దుర్మార్గాలు చేసి, ఇప్పుడు సానుభూతి పొందే ప్రయత్నాలు చేస్తే ఎలా అని నిలదీశారు. నిజాయితీ పరుడైన ఎంపీపై మైకుల ముందు ప్రేలాపనలు పేలితే సరిపోతుందా అని ప్రశ్నించారు. అవినీతి చేయకుంటే రాయబారాలు ఎందుకు చేస్తున్నారని అన్నారు. తనవద్దకు మనుషులను పంపారని ఎంపీ చెప్పలేదా అని ప్రశ్నించారు. వారు చేసిన దోపిడీని సహించలేక సొంతపార్టీ నేతలు ఏపీ హైకోర్టును ఆశ్రయించింది నిజం కాదా అని నిలదీశారు. చిలకలూరిపేటకు అసభ్యపోస్టులు, విషప్రచార సంస్కృతి తీసుకొచ్చిన ఘనత వైసీపీదేనని విమర్శించారు. పిల్లికోటి వ్యవహారంలో చట్టబద్ధమైన చర్యలుం ఉంటాయని చంద్రబాబు ఎప్పుడో చెప్పారని అన్నారు. వైసీపీ నేతలు తప్పు చేసి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని అంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. విడదల రజనీ చేసిన తప్పులు ఎక్కడికి పోతాయని నిలదీశారు. చట్టప్రకారం అందరూ శిక్షార్హులేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు.

# అమానవీయ ఘటనపై గల మెత్తినదర్ జెండర్

## దీపు హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలి

## నిరసన ర్యాలీ చేపట్టి..అశ్రు నివాళులు అర్పించింది

విజయనగరం, అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో : అనకాపల్లిలో జరిగిన ఒక దారుణ ఘటన హిజ్రాల సమాజాన్ని కలచి వేసింది. తమ సామాజిక వర్గాన్ని చెందిన ఒక హిజ్రాపై జరిగిన అమానుషంపై ఆవేదనతో గళమెత్తింది. న్యాయం చేయాలని, తమకి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టింది. ఒకడి దుర్మార్గానికి ప్రాణాలు కోల్పోయిన తమ సహచర హిజ్రా ఆత్మకు శాంతి కలగాలని అశ్రు నివాళులర్పించింది. ఈనెల 19న క్రితం అనకాపల్లిలో దీపు అనే హిజ్రాను ఆమెతో సహవాసం చేసే దుర్గా ప్రసాద్ అలియాస్ బన్నీ అనే వ్యక్తి అత్యంత దారుణంగా హత్య చేశాడు. దీపును హత్య చేసి, మృత దేహాన్ని మూడు ముక్కలుగా చేసి, వాటిని వేర్వేరు చోట్లలో పారవేశాడు. అనకాపల్లి సమీపంలోని ఒక ఫ్లై ఓవర్ కింద గోనే సంచిలో వెలుగులోకి వచ్చిన ఒక భాగాన్ని బట్టి, చనిపోయిన వ్యక్తి హిజ్రా దీపుదిగా పోలీసులు కనుగొన్నారు. ఆపై ఆమెను హత్య చేసింది ఆమెతో సహజీవనం చేసే దుర్గా ప్రసాద్ అనే వ్యక్తిగా పోలీసులు గుర్తించి విచారణ మొదలు పెట్టారు. ఇక దీపు హత్యతో ఉలిక్కి పడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల్లోని హిజ్రాలు అంతా తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అందులో భాగంగా దీపు ఆత్మకు శాంతి కలగాలని విజయనగరంలోని హెల్పింగ్ హాండ్స్ హిజ్రా అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండబాబు, అధ్యక్ష కార్యదర్శులు దవడ మీనాకుమారి, స్రవంతి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎస్ఆర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్లో నిర్వహించే గ్రీవెన్స్ కి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడు దుర్గా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలని, విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిందితుడికి మధ్యంతర బెయిల్ మంజూరు కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మృతురాలు దీపు కుటుంబానికి ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసి ఏదైనా ఘటన జరిగితే త్వరితగతిన విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ట్రాన్స్ జెండర్లకు అవగాహన కల్పించేలా కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. తమపై ఇటువంటి దారుణాలు జరిగినపుడు సమాజంలోని స్త్రీ పురుషుల విషయంలో ఎలాగైతే ప్రభుత్వాలు స్పందిస్తాయో, తమ విషయంలో కూడా అలాగే స్పందించి, తమకు అండగా నిలబడాలని హిజ్రాలంతా కోరారు.

# వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటు-దన్న ఆయన.. నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.. గతంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.. వైఎస్ జగన్ రైతులను ఆదుకోవడం మర్చిపోయి.. విలాసాలు కోసం వేల కోట్లు- ఖర్చు చేశారన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెక్టార్‌కు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.25 వేల నుంచి రూ.35 వేలకు అందించిన విషయం జగన్ రెడ్డికి కనిపించలేదా అని ప్రశ్నించారు.అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటుందన్నారు అచ్చెన్నాయుడు.. అరటి, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు కొన్నిచోట్ల అకాల వర్షాలతో పంట నష్టం జరిగిందని వివరించారు.. గత అయిదేళ్లలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఒక్క ఏడాది కూడా ఆదుకోలేదన్నారు.. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు అకాల వర్షాలతో నష్టపోయి రోడ్డున పడ్డా పరిహారం అందించకుండా జగన్ రెడ్డి విలాసాల కోసం వేలకోట్లు- వృథా చేశారని ఆరోపించారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం అందించి రైతులకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటు-ందని స్పష్టం చేశారు.. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు. అరటి రైతులకు హెక్టారుకు రూ.35,000 మేర ఇన్ పుట్ సబ్సిడీ అందచేస్తాం.. మొక్కలు తిరిగి వేసుకునేందుకు అదనంగా హెక్టారుకు రూ.75 వేలు అందజేయడం జరుగుతుంది. మొత్తం రూ.1,10,000 వరకు సాయం అందుతుందన్నారు.. ఇన్సూరెన్స్ ఉంటే వారికి అదనంగా చెల్లింపులు ఉంటాయని వెల్లడించారు.. అనంతపురం, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అధికారులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలో ఎన్యూమరేషన్ ప్రక్రియ మొదలవుతుంది. రైతులు ఎవరూ అధైర్యపడవద్దు, ఆందోళన చెందవద్దు అని ధైర్యం చెప్పారు మంత్రి అచ్చెన్నాయుడు..